నమస్తే తెలంగాణ
జనగామ
5 | వరంగల్, బుధవారం 2 అక్టోబర్ 2024 | JANAGAON

హనుమకొండలోని ఏకశిల పాఠశాలలో బతుకమ్మ వేడుకలు

పూల జాతరకు వేళాయె!

నేటి నుంచి బతుకమ్మ సంబురాలు

శాయంపేట/కృష్ణకాలనీ, అక్టోబర్ 1 : పూల జాతరకు వేళైంది. 'బక్కేసి పువ్వేసి చందమామ' అని భక్తి పారవశ్యంతో ఆడపడుచులు పూలను పూజించే సంప్రదాయ పండుగే బతుకమ్మ. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక. పూలు బాగా వికసించే కాలంలో జరిగే పూల జాతర. ఆశ్వయుజ అమావాస్య (బుధవారం) నుంచి తొమ్మిది రోజుల పాటు చిన్న, పెద్ద అనే తేడాలేకుండా ఆడపడుచులంతా పూల వేడుకల్లో ఆడి, పాడతారు. తొలిరోజు ఎంగిలిపూలతో మొదలై వరుసగా అటుకుల, ముద్దపప్పు, నాన, అట్ల, అలిగిన, వేపకాయల, వెన్నముద్దల బతుకమ్మగా, చివరిదైన తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మగా గౌరమ్మను సాగనంపడంతో వేడుకలు ముగుస్తాయి. బంధాలు, అనుబంధాలను గుర్తు చేస్తూ, ప్రకృతిని ఆరాధిస్తూ తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పే పూల సంబురం బతుకమ్మ. అంతటి ప్రాశస్త్యం ఉన్న బతుకమ్మను కనులపండువగా జరుపుకునేందుకు అడపడుచులు సిద్ధమయ్యారు.

హనుమకొండ చౌరస్తాలో పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు

పండుగ విశిష్టత

బతుకమ్మ తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమైన పండుగ. రంగరంగుల పూలతో అలంకరించిన బతుకమ్మల చుట్టూ చప్పట్లతో వలయాకారంగా తిరుగుతూ పాడే బతుకమ్మ పాటలు ఆద్యంతం అలరిస్తాయి. 'బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో' అంటూ సాగే పాటల్లో మహిళలు తమ కష్టాలు, బంధుత్వం, ప్రేమ, ఆప్యాయత, భక్తి, భయంతో పాటు పురాణ ఇతిహాసాలను మేళవిస్తారు. బతుకమ్మ వర్షాకాలం చివరలో, శీతాకాలం మొదట్లో వచ్చే పండుగ. అప్పటికే చెరువులన్నీ నీళ్లతో నిండి రకరకాల పూలు ఆరబోసి ఉంటాయి. వీటిలో గునుగు, తంగేడు ఎక్కువగా పూస్తాయి. బంతి, చేమంతి, నందివర్ధనం వంటి పూలకు ఇదే సమయంగా చెబుతారు.

బతుకమ్మ పండుగ జరపుకోవడానికి వినియోగించే పూలకు కూడా ప్రత్యేకతలున్నాయి. ఔషధ గుణాలున్న పూలను బతుకమ్మను పేర్చడానికి ఉపయోగిస్తారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి, కట్ల, సంపెంగ, మొల్ల, సీత జడలు, రుద్రాక్ష, పోకబంతి, మల్లె, మందార, పారిజాతం, కమలం,

పూలకు ప్రత్యేకతలెన్నో..

తామర, గన్నేరు, గుమ్మడి, గులాబి, పట్టుకుచ్చులు పూలతో బతుకమ్మలను పేర్చి సంబురాలు జరుపుకుంటారు. తంగేడు పువ్వు షుగర్‌కు, తామర స్వచ్ఛతకు ప్రతీకగా, గునుగు పొక్కులు, క్షయ వ్యాధి నివారణకు ఎంతో ఉపయోగపడతాయి. బతుకమ్మకు వాడే ప్రతి పువ్వు మనిషి ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడుతుంది.

బతుకమ్మను పేర్చే విధానం..

పెద్ద తాంబాలం లేదా సిబ్బిలో తంగేడు ఆకులను పేరుస్తారు. పూలను కట్టగా కట్టి కొనలను రంగుల్లో ముంచుతారు. తర్వాత బంతి, చామంతి, గన్నేరు, మందార, కలువ, తామర తదితర పూలను శంకం ఆకారంలో పేర్చుతారు. పేర్చిన బతుకమ్మ మీద రెండు తమలపాకులు పెట్టి పసుపుతో గౌరమ్మను చేసి పెడ్తారు. దీనికి కుంకుమ బొట్టు పెడ్తారు. మొదట్లో ఇంట్లో దేవుని వద్ద మొక్కి పీటపై పెట్టి వాడిపోకుండా చూస్తారు. సాయంత్రం మహిళలు, చిన్నారులు గ్రామాలు, పట్టణాల్లోని ఆలయాలు, ప్రధాన కూడళ్లలో ఒక్కచోట చేరి ఆడిపాడి బతుకమ్మలను చెరువులు, నదులలో నిమజ్జనం చేస్తారు. అమ్మవారికి నైవేద్యంగా పెట్టిన ప్రసాదాలను, వాయనాలను ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకుంటారు. అయితే చివరి రోజు సద్దుల బతుకమ్మను అత్యంత భక్తి, శ్రద్ధలతో జరుపుకుంటారు.

హనుమకొండ బస్‌స్టేషన్‌లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

బస్సులు లేక.. వచ్చినవి చాలక..

హనుమకొండ బస్ స్టేషన్‌లో ప్రయాణికుల ఇబ్బందులు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 1 : హనుమకొండ బస్‌స్టేషన్‌లో బస్సులు లేక ప్రయాణికులు అవస్థలు పడ్డారు. బుధవారం నుంచి బతుకమ్మ, దసరా సెలవులు ప్రకటించడంతో పాఠశాలల విద్యార్థులు, ప్రజలు సొంతూళ్లకు వెళ్లేందుకు బస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. దీంతో మంగళవారం బస్‌స్టేషన్ ప్రాంగణమంతా ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. అయితే ప్రయాణికులకు అనుగుణంగా బస్సులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గంటల కొద్దీ బస్సుల కోసం ఎదురుచూశారు. అడపా, దడపా వచ్చిన బస్సులు ఎక్కేందుకు, సీట్లు దొరకబుచ్చుకునేందుకు నానా తంటాలు పడ్డారు. చిన్న పిల్లలను కిటికీల్లోంచి బస్సు లోపలికి పంపించారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులు సీఎం రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. అనవసరంగా ఓట్లేసి గెలిపించామని, మహాలక్ష్మీ పథకాన్ని ఎవరు పెట్టమన్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

తన కూతురిని కిటికీలోంచి బస్సులోకి ఎక్కిస్తున్న తండ్రి

బస్సు ఎక్కేందుకు పాట్లు పడుతున్న ప్రయాణికులు

హామీలు అమలుచేసేదాకా కొట్లాడుతాం

- రూ.2 లక్షల రుణ మాఫీ ఇంకా కాలేదు
- యాసంగి వచ్చినా రైతు భరోసా రాలేదు
- 4న తొర్రూరు, వర్ధన్నపేటలో బీఆర్ఎస్ ఆందోళన
- హాజరుకానున్న మాజీ మంత్రి హరీశ్‌రావు
- విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు ఎర్రబెల్లి పిలుపు

రుణమాఫీ అమలులో కాంగ్రెస్ సర్కారు విఫలం

పాలకుర్తి రూరల్ : బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

పాలకుర్తి రూరల్/రాయపర్తి/పెద్దవంగర/వర్ధన్నపేట, అక్టోబర్ 1 : రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని.. రైతులు, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేదాకా కొట్లాడుతామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టంచేశారు. ఈ నెల 4న నియోజకవర్గంలోని తొర్రూరులో బీఆర్ఎస్ నేతృత్వంలో నిర్వహిస్తున్న రైతుల ఆందోళన, పార్టీ శ్రేణుల రాస్తారోకో కార్యక్రమాలకు మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరవుతున్నట్లు ఆయన వివరించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి కార్యకర్తలు, రైతులు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఎర్రబెల్లి కోరారు. మంగళవారం పాలకుర్తి నియోజకవర్గంలోని రాయపర్తి, పెద్దవంగర మండల కేంద్రాల్లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాల్లో, పాలకుర్తిలోని సోమేశ్వర ఫంక్షన్ హాల్‌లో పాలకుర్తి, దేవరుప్పుల, కొడకండ్ల మండలాల ముఖ్యనాయకులు, కార్యకర్తల సమావేశాలు నిర్వహించగా ఆయన పాల్గొన్నారు. అలాగే వర్ధన్నపేట మండలం ఇల్లందలో పర్వతగిరి, ఐనవోలు, వర్ధన్నపేట మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సారథ్యంలో దోపిడీదారుల పాలన కొనసాగుతున్నదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ మంత్రులు, కార్పొరేషన్ చైర్మన్లు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఆర్థిక వనరుల దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి వర్గంలో కూడా అసమ్మతి రాజుకుంటున్నదని, ప్రభుత్వం ఉంటుందో, పోతుందో అనే భయంతోనే ఆయన పాలన చేస్తున్నాడన్నారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌ల సారథ్యంలో బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఎదురుదాడిని కాంగ్రెస్ ప్రభుత్వం తట్టుకోలేకపోతున్నదని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో చేపట్టిన మూసీ నది ప్రక్షాళన, హైడ్రా కూల్చివేతలతో వలస కుటుంబాలు, రోజువారీ కూలీలు, నిరుపేదలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు నిత్యం ప్రభుత్వ తప్పిదాలను ప్రజల్లో ఎండగట్టాలన్నారు. కాంగ్రెస్ ప్రకటించనట్లు రూ.2 లక్షల రుణమాఫీ 50శాతం కూడా ఎక్కడా జరగలేదన్నారు. యాసంగి సీజన్ వచ్చినా రైతు భరోసా పెట్టుబడి సాయం రైతులకు అందలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో రైతులు పెట్టుబడికి గోసపడకుండా రైతు బంధు పథకాన్ని ప్రవేశపెట్టి ఏటా ఎకరానికి రూ.10 వేల చొప్పున అందజేశారని గుర్తుచేశారు. అలాగే వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించే రైతు రుణమాఫీపై ధర్నాకు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలన్నారు.

సమావేశాల్లో ఆయా మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు మునావత్ నర్సింహనాయక్, ఐలయ్య, తీగల దయాకర్, తూళ్ల కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి సంజయ్, జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి, మాజీ దేవస్థాన చైర్మన్ రామచంద్రశర్మ, నాయకులు పల్లా సుందర్‌రామిరెడ్డి, నల్లా నాగిరెడ్డి, బస్వ మల్లేశం, పేరం రాము, పసునూరి నవీన్, మాచర్ల ఎల్లయ్య, చింత రవి, బొబ్బల ఆశోక్‌రెడ్డి, గాంధీ నాయక్, జినుగు అనిమిరెడ్డి, రంగు కుమార్, ఎండీ నయీం, పూస మధు, కుందూరు రాంచంద్రారెడ్డి, అయిత రాంచందర్, పారుపల్లి సుధాకర్‌రెడ్డి, ముద్రబోయిన సుధాకర్, చందు రామ్‌యాదవ్, బెల్లి పెద్దాపురం, గజవెల్లి ప్రసాద్, చిన్నాల ఉప్పలయ్య, బొడ్డు రంగయ్య, కుందూరు యాదగిరిరెడ్డి, భూక్యా క్రాంతి, సుధీర్ కుమార్, జ్ఞానేశ్వరాచారి, వెంకట్రామయ్య, భాస్కర్ రావు, పటేల్‌నాయక్, రాము, సమ్మయ్య, రఘు, షర్ఫుద్దీన్, వెంకట్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్, అనుదీప్, వర్ధన్నపేట మాజీ ఎంపీపీ అన్నమనేని అప్పారావు, మాజీ జడ్పీటీసీ మార్గం భిక్షపతి, గుజ్జ సంపత్‌రెడ్డి, గుజ్జ గోపాల్‌రావు, చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'పోలీసులను చూస్తే దొంగలు, రౌడీలు భయపడాలి కానీ.. ఇక్కడ మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నది. అధికారం అండతో రెచ్చిపోతున్న రౌడీలు, మాజీ రౌడీషీటర్లు ఏది చెబితే అదే శాసనం అన్నట్టు కొందరు ఖాకీలు జీ హుజూర్ అంటూ సామాన్యులపై ప్రతాపం చూపుతున్నా పోలీస్ కమిషనర్ ఎలాంటి యాక్షన్ తీసుకోకపోవడంపై అధికార పార్టీ నేతలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ మేరకు ఇటీవల జరిగిన పరిణామాలు, రౌడీలతో 'పోలీస్ ఫ్రెండ్‌షిప్', భూకబ్జాలు, సొంత పార్టీ నేతల మీదే దాడులు తదితర విషయాలపై ఉమ్మడి జిల్లాలోని ఓ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఇద్దరు కలిసి ఇటీవల స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా ఓ ఏసీపీ, ఇద్దరు సీఐల వ్యవహారం దారుణంగా ఉందని.. రౌడీలు చెప్పినట్లు పోలీసులు నడుచుకుంటున్నారంటూ ఉదాహరణలతో సహా వివరించడంతో పాటు ఇంత జరుగుతున్నా పోలీస్ కమిషనర్ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటూ అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో వరంగల్‌లో జరుగుతున్న పరిణామాలను సీరియస్‌గా తీసుకొని విచారణకు ఆదేశించిన రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు అక్కడి ఇంటెలిజెన్స్‌కే ఆ బాధ్యత అప్పగించినట్లు తెలిసింది.

- వరంగల్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

రౌడీలు రెచ్చిపోతున్నా.. నో యాక్షన్

రౌడీషీటర్లతో 'పోలీసుల ఫ్రెండ్‌షిప్'పై సర్వత్రా ఆగ్రహం

- ఇటీవలి పరిణామాలపై గుర్రుగా ఉన్న ఓ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ
- వరంగల్ సీపీ పనితీరుపై తీవ్ర అసంతృప్తి
- దాడులు చేసినా పట్టించుకోవడం లేదు
- ఓ ఏసీపీ, ఇద్దరు సీఐల తీరు దారుణం
- ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఫిర్యాదు
- విచారణకు ఆదేశించిన పోలీసు ఉన్నతాధికారులు

వరంగల్ నగరంలో కొందరు పోలీసులు, రౌడీలు కలిసి పనిచేస్తున్నారని.. ఇలాంటి వాటిని వెంటనే నియంత్రించాలని వరంగల్ ఉమ్మడి జిల్లాలోని అధికార పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్యే, ఓ ఎమ్మెల్సీ స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. రౌడీలకు, మాజీ రౌడీషీటర్లకు కొందరు పోలీసులు పూర్తిస్థాయిలో అండదండలు అందిస్తున్నారని, దీనివల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. చట్టం, న్యాయం అనేవి లేకుండా పోయాయని వివరించారు. పోలీసు అధికారుల ప్రవర్తనపై వరంగల్ పోలీసు కమిషనర్ తీరు అస్సలు బాగా లేదని చెప్పారు. రౌడీలతో కలిసి పనిచేస్తున్న పోలీసులపై కనీస చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. కొందరు పోలీసులు, రౌడీలతో కలిసి పేదలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. వరంగల్ నగరంలో ఇటీవల జరిగిన కొన్ని పరిణామాలపై ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కలిసి రెండు రోజుల క్రితం సీఎం రేవంత్‌ని కలిశారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో మాజీ రౌడీషీటర్, ఓ ఏసీపీ, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు కలిసి.. సామాన్యులను ఇబ్బంది పెడుతున్న విషయాలను వివరించారు. వాస్తవాలను నిర్ధారించుకుని వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఓ మాజీ రౌడీషీటర్ పోలీసు మద్దతుతో సామాన్యులతో పాటు అధికార పార్టీకి చెందిన నాయకుల పైనా దాడులు చేశారని చెప్పారు. దాడికి గురైన అధికార పార్టీ నేతను పరామర్శించేందుకు వెళ్లాలని ప్రయత్నిస్తే పోలీసులు వద్దని చెప్పారని తెలిపారు. పోలీసులు అంటే రౌడీలకు భయం ఉండేదని, ఇప్పుడు రౌడీలకే పోలీసులు భయపడుతున్న పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. మాజీ రౌడీషీటర్ వస్తుంటే ఓ ఏసీపీ, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు ఎదురు వెళ్లి సెల్యూట్ చేసి మరీ తీసుకువచ్చి కూర్చోబెడుతున్నారని చెప్పారు. మాజీ రౌడీ షీటరు చెప్పినట్లుగానే పోలీసులు నడుచుకుంటున్నారని, పోలీస్‌స్టేషన్లలో ఏం చేయాలనేది మాజీ రౌడీషీటర్ శాసిస్తున్నాడని వివరించారు.

రౌడీలను నియంత్రించే విషయంలో వరంగల్ పోలీస్ కమిషనర్ తీరు అస్సలు బాగా లేదని చెప్పారు. మాజీ రౌడీ షీటర్, పోలీసులు కలిసి అధికార పార్టీ అధ్యక్షుడిపై దాడి చేసినా పోలీసులు కనీస చర్యలు తీసుకోలేదని అన్నారు. మంత్రి అండదండలు, పోలీసుల మద్దతుతో మాజీ రౌడీ షీటర్ సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని పలు ఉదాహరణలతో వివరించారు. వరంగల్ నగరంలోని సామాన్యులకు భూముల కబ్జాలపై భయం పెరుగుతున్నదని, అభివృద్ధి చెందుతున్న నగరానికి ఇలాంటివి మంచివి కాదని తెలిపారు. కుటుంబసభ్యుల మధ్య ఉండే విభేదాలను ఆసరా చేసుకుని పోలీసుల సహకారంతో భూకబ్జాలకు పాల్పడుతున్నారని చెప్పారు. వరంగల్ నగరంలో ఇప్పుడు ఉన్న దారుణ పరిణామాలు తమ 30 ఏండ్ల రాజకీయ జీవితంలో ఎప్పుడూ చూడలేదని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ వాపోయారు.

ఉన్నతాధికారులు సీరియస్.. విచారణ షురూ..

వరంగల్ నగరంలో పోలీసులు, రౌడీలు కలిసి సామాన్యులను ఇబ్బంది పెడుతున్న వ్యవహారంపై ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఫిర్యాదుపై పోలీసు శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించినట్లు తెలిసింది. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఫిర్యాదుపై విచారణకు ఆదేశించారు. వరంగల్ పోలీసు కమిషనర్ పరిధిలోని ఇంటెలిజెన్స్ విభాగంపైనా రాష్ట్ర అధికారులు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. ప్రజలకు, రాజకీయ అంశాలతో ముడిపడి ఉన్న సంఘటన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు చేరవేయాలని గట్టిగా చెప్పినట్లు సమాచారం. ఎమ్మెల్యే, ఎమ్మెల్యే ఫిర్యాదు అంశాలపై వరంగల్ పోలీసు కమిషనర్ పరిధి ఇంటెలిజెన్స్ విభాగాన్ని పక్కనబెట్టి రాష్ట్ర స్థాయి విభాగం వారే విచారణ మొదలుపెట్టినట్లు తెలిసింది.

సీపీపైనా అసంతృప్తి

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఓ మాజీ రౌడీ షీటర్‌కు అనధికారికంగా పోలీసు ప్రొటోకాల్‌ను అమలు చేస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఏమిటని ఓ ఎమ్మెల్యే వరంగల్ పోలీసు కమిషనర్‌ను ప్రశ్నించినట్లు తెలిసింది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ మీటింగ్‌కు మాజీ రౌడీ షీటర్ రావడమే కరెక్టు కాదని, అక్కడికి వచ్చిన ఆయనకు ఏసీపీ, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు సెల్యూట్ చేసి ప్రత్యేకంగా ఓ గదిలోకి తీసుకుపోవడం గతంలో ఎప్పుడూ చూడలేదని చెప్పినట్లు సమాచారం. మాజీ రౌడీ షీటర్‌కు ఇప్పటికే ఇద్దరు గన్‌మెన్ ఉన్నారని, ఇప్పుడు పోలీసుల సహకారంతో వ్యక్తిగత తుపాకీ లైసెన్స్ కోసం దరఖాస్తు చేశాడని పేర్కొన్నట్లు తెలిసింది. ప్రజలను ఇబ్బందులు పెట్టే వారిపై కఠినంగా వ్యవహరించాల్సిన పోలీసులు బాధితులకు కాకుండా ఇబ్బందులు పెట్టే వారికి సహకరించడం సరైన పద్ధతి కాదని వరంగల్ పోలీసు కమిషనర్‌పై ఆ ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది.

కేయూలో విజిలెన్స్ దాడులు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 1: కాకతీయ యూనివర్సిటీలో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీ బాలుకోటి, సీఐ రాకేశ్, ఇతర అధికారులు కేయూ పాలన భవనంలో విచారణ చేపట్టారు. మాజీ వీసీ తాటికొండ రమేశ్ అక్రమాలపై అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్(అకుట్) బాధ్యులు ప్రభుత్వానికి, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వం స్పందించి విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పెరటి మల్లారెడ్డి అందుబాటులో లేకపోవడంతో ప్రస్తుత ఇన్‌చార్జి రిజిస్ట్రార్, కంట్రోలర్ నరసింహాచారి, వర్సిటీ ఆడిట్, స్టేట్ లోకల్ ఆడిట్ వారిని రిజిస్ట్రార్ చాంబర్‌కు పిలిపించుకొని అన్ని ఫైల్స్‌పై ఆరా తీశారు. నాలుగుసార్లు రిజిస్ట్రార్‌కు నోటీసులు ఇచ్చినా వాటికి సంబంధించిన ఫైల్స్ ఇప్పటివరకు ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించినట్లు సమాచారం. సీనియర్ ప్రొఫెసర్ ప్రమోషన్‌కు సంబంధించిన సెలెక్షన్ కమిటీ ప్రొసీడింగ్స్, ఈసీ మినట్స్ గురించి ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌ను ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఫార్మసీ, ఇంజినీరింగ్‌లలో జరిగిన పీహెచ్‌డీ అక్రమాలపై కూడా ఆరా తీసినట్లు తెలిసింది. పాత సర్వీసును అక్రమంగా కలుపుకొని రిజిస్ట్రార్ ఆర్డర్ ద్వారా ప్రమోషన్లు పొందుతున్న వారితోపాటు పాత పెన్షన్ విధానంలోకి మారిన వారికి సంబంధించిన వివరాలు సేకరించినట్లు సమాచారం.

అటెండర్‌కు షోకాజ్.. జడ్పీకి సరెండర్

విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు : ఎంపీడీవో విజయ


అటెండర్ సాయిబాబును విచారణ చేస్తున్న ఎంపీడీవో విజయ

నమస్తే ఎఫెక్ట్

వాజేడు, అక్టోబర్ 1 : విధుల్లో నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఎంపీడీవో విజయ హెచ్చరించారు. అటెండర్‌కు షోకాజ్ నోటీసు ఇవ్వడంతో పాటు త్వరలో జడ్పీ ఆఫీసుకు సరెండర్ చేయనున్నట్లు తెలిపారు. కార్యాలయ గదిలోనే అటెండర్ సాయిబాబు నివాసం ఉండడం, సమయపాలన పాటించని ఉద్యోగుల తీరుపై మంగళవారం 'నమస్తే తెలంగాణ'లో 'అది ఆఫీసా? ఇల్లా?' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఎంపీడీవో స్పందించి విచారణ జరిపారు. పలుమార్లు హెచ్చరించినా పనితీరు మారదా? అని అటెండర్‌పై ఆగ్రహం వ్యక్తంచేయడంతో పాటు వెంటనే ఆఫీస్ గదిని ఖాళీ చేయాలని చెప్పారు. అలాగే ఉద్యోగులను సైతం సమయపాలన పాటించాలని మందలించారు.

36.2 అడుగుల భారీ బతుకమ్మ

ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు

జనగామ చౌరస్తా, అక్టోబర్ 1: జనగామ జిల్లా కేంద్రంలోని సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో మంగళవారం 36.2 అడుగుల భారీ బతుకమ్మను తయారు చేశారు. పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో 30 మంది ఉపాధ్యాయులు, 700 మంది విద్యార్థులు కలిసి 24 గంటలపాటు బతుకమ్మను పేర్చినట్లు ప్రిన్సిపాల్ బసాని శ్రీధర్ తెలిపారు. ఈ బతుకమ్మ ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు సంపాదించినట్లు పేర్కొన్నారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డు ప్రతినిధులు ప్రిన్సిపాల్‌కు సర్టిఫికెట్ అందజేశారు.

మంత్రి అనుచరుడి ఓవరాక్షన్

- సీఐతో నువ్వెవరంటూ రెచ్చిపోయిన వైనం
- మాజీ రౌడీషీటర్‌కు గట్టిగా వార్నింగ్ ఇచ్చిన సదరు సీఐ

మాజీ రౌడీషీటర్‌కు నేను ఎవరో తెలుసా అంటూ వార్నింగ్ ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ సతీశ్

సుబేదారి, అక్టోబర్1 : మంత్రి కొండా సురేఖ అనుచరుడు, మాజీ రౌడీషీటర్ నవీన్ రాజ్ డ్యూటీలో ఉన్న ఓ పోలీసు అధికారిపై ఓవరాక్షన్ ప్రదర్శించగా, ఆయన పోలీసు స్టైల్‌లో గట్టిగా వార్నింగ్ ఇచ్చాడు. ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్ అయింది. మంగళవారం వరంగల్‌లోని ఇస్లామియా జూనియర్ కాలేజ్ మైదానంలో ఎగ్జిబిషన్ ప్రారంభ కార్యక్రమానికి మంత్రి కొండా సురేఖ హాజరై వెళ్తున్న క్రమంలో కార్యకర్తలు అడ్డువచ్చారు. బందోబస్తు డ్యూటీలో ఉన్న సీఐ సతీశ్ జరగండని అనడంతో మంత్రి పక్కనే ఉన్న మాజీ రౌడీషీటర్ నవీన్‌రాజ్ ఎవరు నువ్వు.. ఎందుకు నెడుతున్నావు.. నేనెవరో తెలుసా అంటూ రెచ్చిపోయాడు. దీంతో సదరు ఇన్‌స్పెక్టర్ నేనెవరో తెలుసా అంటూ.. గట్టిగా వార్నింగ్ ఇచ్చాడు. దీంతో పార్టీ కార్యకర్తలు, పోలీసు సిబ్బంది కంగుతిన్నారు. ఈ ఘటన సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో యూనిఫాంలో ఉన్న పోలీసు అధికారిపై మాజీ రౌడీషీటర్ తీరును తప్పుపడుతూ నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి అనుచరుడికి గట్టి వార్నింగ్ ఇచ్చి దమ్మున్న పోలీసు అనిపించుకున్నాడని ఆ సీఐకి వారు మద్దతు పలికారు.